1Ho

# “నువ్వు లేవు; నీ పాటవుంది”

“భావి సూర తీరాలకు
చేరువగా విహరిస్తూ
జీవనాడి స్పందించే
రుధిర మధువు లందించే
యువకవి లోక ప్రతినిధి—
నవ భావామృత రసధుని—
కవితా సతి నొసట నిత్య
రస గంగాధర తిలకం”– మన బాల గంగాధర్ తిలక్ ఈ నాడు జీవించివుంటే గలగలా నవ్వి వుండేవాడు

తన కవితా సంపుటికి సాహిత్య అకాడమీవారు బహుమతి నివ్వనున్నారని తెలిసి ఫక్కున నవ్వేవాడు

“అమరుడికి
అందమైనవాడికి
ఆనందం మనిషయినవాడికి
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించినవాడికి
అమృతాన్ని దోసిళ్ళతో తాగినవాడికి
గుండెలోంచి భూమధ్యరేఖ వెళ్ళిన వాడికి
సూర్యుని తలమీద పువ్వుగా ధరించినవాడికి
ఆగామి కాల గంభీరస్వామి కంఠాన వేయబోయే మాలగా
నిలిచి, పిలచి, దశదిశల కలిపినవాడికి

ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కా దొక

స్థిరబిందువు అన్న వాడికి

అందం, ఆనందం పరమావధిగా

అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతంచేసే కవితతో

అగ్ని చల్లి, అమృతం కురిసిన

అమరుడికి"

అకాడమీ బహుమతి!

వహావ్వా!

అకాడమీలూ ఎదుగుతున్నాయి,

అకాడమీలూ ''ఎడొలసన్స్'' లోంచి బయటపడుతున్నాయి.

కాని అకాడమీల ఇల్లరికపు టల్లుళ్ళు ఇంకా వుంటూనే వున్నారు.

తమ బహుమతులతో అనువాదాలను కొంటునేవున్నారు.

అకాడమీ - సాహిత్య విశ్వానికి విష్ణువు వంటిది.

అయితే బహుమతులనేటివార్షికం సందర్భంగా అకాడమీ అవుతుంది త్రినేత్రుడు

ఆ మూడు కండ్లూ సాధారణంగా తెలుగు సాహిత్యానికి ముండ్లు! కొండొకచో పుండ్లు.

ఆ కన్ను అటు—

ఈ కన్ను ఇటు—

ఓ కన్ను ఎటో -

అటూ - ఇటూ ఎటో-

చూచే--

చూస్తున్నా మనుకునే
కన్నుల వెనుక కన్ను-
అమ్మలగన్న అమ్మలాటిది
అయ్యలగన్న అయ్యలాటిది
అలనాటి రాజరాజ నరేంద్రుడికీ, కృష్ణదేవరాయడికీ
పౌత్రుడి పౌత్రుడి ననుకునేటిది-
సాహిత్య సర్వంసహాధికారసారభౌమత్వపు కిరీటాన్ని
స్వయంగా నెత్తిమీద పెట్టుకున్నది
అది వున్నది
అది వున్నవి
అది వున్నారు
శివాయ విష్ణురూపాయ
ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒక జడ్జికీ ఎన్నో పేరులు! [ఒక బహుమతికే ఎన్నోదారులు]
అందుచేతనే మైడియర్ రీడర్!
ఆకాడమీ బహుమతులు ఉత్తర ధ్రువం
మంచిమంచి పుస్తకాలు దక్షిణ ధ్రువం
అందుచేతనే ఓ అకాడమీ!
అనగా అనగానే, అనుకోసుమీ
"అమృతం కురిసిన రాత్రి"ని
ఆ అమృతం కురిసిన ఈ తెలుగు కవితా ధాత్రిని
గుర్తించావని,
ఆ రాత్రి నువ్వు నిద్ర మేలుకునే వున్నావని

ఆ వాన జలజలలను విన్నావనీ
అవి అమృతం సోనలని తెలుసుకున్నావనీ
తెలిసి ఎంత సంతసమయిందనీ!
ఆయినా గుడ్ ఓల్డ్ అకాడమీ!
"అమృతం కురిసిన రాత్రి"ని
నువ్వు ఆల్ మోస్ట్ మిస్ అయ్యావనీ
అవధానాల, ఆశీర్వాదాల
అంకితాల రాయుళ్ళ
చరణ చారణ చక్రవర్తుల
"చారణా" మెంబర్ల
ఇన్ఫ్లూయెంజాలో
పడ్డావనీ ....
కౌరవసభలో ద్రౌపదిలా నిల
బడ్డావనీ
అయినా
కృష్ణపరమాత్ముడే వచ్చి
అల్లోపతియో, ఆయుర్వేదమో
మందిచ్చాడనీ--
అటుపిమ్మట
ముందున్న గోతిని
ఛెంగు ఛెంగున దాటావనీ
తెలిసి పూర్వభాగానికి ఖేదం
మరియు ఉత్తర భాగానికి మోదం

కలిగెను సుమీ....
నిజంగానే అకాడమీ !
మావాడు - మహాగట్టివాడు
ఆ నాడే చెప్పాడు
"దేవుడా
రక్షించు నా దేశాన్ని
పవిత్రులనుండి, పతివ్రతలనుండి
పెద్ద మనుషులనుండి పెద్దపులులనుండి
నీతుల రెండునాల్కలుసాచిబుసలుకొట్టే
నిర్హేతుక కృపాసర్పాలనుండి
లక్షలాది దేవుళ్ళనుండి, వారి పూజారుల నుండి
వారివారి ప్రతినిధులనుండి
సిద్ధాంత కేసరులనుండి సిద్ధులనుండి
శ్రీ మన్మద్గురు పరంపరలనుండి—
ఈనాడు మే మడిగేది
"దేవుడా
రక్షించు మా అకాడమీని"
అని మాత్రమే సుమండీ!
అకాడమీ బహుమతుల జీవితానికిది"
నిజంగా 'అమృతం కురిసిన రాత్రి కావాలనీ-
ప్రతి బహుమతీ, అకాడమీకి ఇలాగే
ఒక అలంకారం కావాలనీ
వేడుకుంటున్నాము....
ఈ ఏడు
నీ బహుమతికి
పాడుకుంటున్నాము.

[26 ఫిబ్రవరి 71]